సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం ; 10 ; జూన్ ; 2025



పోస్టల్ ఇన్సూరెన్స్ భళా!

తపాలా శాఖలో పలు పాలసీలు ఉన్నా ప్రజల్లో అవగాహన ఆశించిన స్థాయిలో లేదు. జీవిత బీమా పథకం ప్రజల జీవితాలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా దోహదపడుతోంది. - 8లో



కవలల జీవితం.. విషాదాంతం

రామ్ లక్ష్మణ్ అనే కవల పిల్లల జీవితం విషాదాంతమైంది. వేసవి సెలవులకు మేనమామ వద్దకు వచ్చి నీటి గుంటలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.2 /28.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 28.0 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

శ్రీవీరభద్రస్వామికి రూ.44,952 ఆదాయం

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ద్వారా వీరభద్రస్వామికి రూ.44,952లు ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్రస్వామి, భద్రకాళిమాత, కేథారీశ్వరుడుకు ప్రత్యేక పూజలు జరిపారు. కర్నూలుకు చెందిన దాచూరి వినయ్ కుమార్ రూ.20,001లు, తొండూరు గ్రామానికి చెందిన అలవలపాటి ముకుందారెడ్డి రూ.10,116, అలవలపాటి గౌతమ్‌రెడ్డి రూ.10,116 అన్నదాన కార్యక్రమానికి విరాళంగా అందజేశారు.

బాధితులకు న్యాయం చేయాలి

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదు దారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొనసాగుతున్న ఔట్‌ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయం నుంచి గాలేరు- నగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా సర్వరాయసాగర్‌కు 250 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కొనసాగుతున్నట్లు జీఎన్ఎస్ఎస్ ఈఈ ఉమమహేశ్వర్లు సోమవారం తెలిపారు. శెట్టివారిపల్లె మొయిన్ రెగ్యులేటర్ వద్ద గేట్లు ఎత్తి జీఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి కృష్ణాజలాలను సర్వరాయ సాగర్‌కు వదులుతున్నామన్నారు. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం నుంచి రెండు మోటర్లతో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 1000 క్యూసెక్కులను పంపింగ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 15.8 టీఎంసీలు ఉన్నట్లు చెప్పారు.

కొమ్మినేని అరెస్టు విచారకరం

– మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : జర్నలిజంలో 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం చేసిన మచ్చలేని, సౌమ్యుడైనటువంటి కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 70 ఏళ్ల వయసు ఉన్న కొమ్మినేని చేయని తప్పునకు, అనని మాటకు దోషిగా కేసులు నమోదు చేయడంతోపాటు పనిగట్టుకుని హైదరాబాద్ నుంచి ఆయనను విజయవాడకు తరలించడం మానసికంగా, శారీరకంగా వేధించడమేనని అన్నారు. సాక్షినే కాదు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ9, ఎన్‌టీవీ లాంటి అన్ని ఛానల్స్‌లో ప్రతి రోజు డిబెట్లు నిర్వహించడం సర్వసాధారణంగా జరుగుతోందన్నారు. అనేక రకాల అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ప్రాముఖ్యతగల అంశాలను మేధావులను పిలిపించి, రాజకీయ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టులచేత డిబెట్లను నిర్వహించడం పరిపాటి అన్నారు. అలాంటి డిబెట్ సాక్షిలో జరిగినప్పుడు అమరావతి రాజధానికి సంబంధించి విశ్లేషకుల్లో ఒకాయన కృష్ణం రాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఆ ప్రాంత మహిళలను అగౌరవపరిచే విధంగా ఉండటంతో డిబెట్ నిర్వహించిన కొమ్మినేని వెంబడే ఖండించారన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ సాక్షి మీడియాపై వ్యక్తిగత కక్షతో ఇలా చేశారన్నారు.పచ్చమీడియాకు సంబంధించిన టీవీ5, ఏబీఎన్, ఈనాడు, మహాన్యూస్ లాంటి ఛానళ్లలో ఎన్ని మార్లు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను, ఆయన కుటుంబ సభ్యులైన భారతి, షర్మిలను వ్యక్తిగతంగా విమర్శించలేదా అని రాచమల్లు ప్రశ్నించారు. సీనియర్ జర్నలిస్టుకు జరిగిన ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

అంతా అస్తవ్యస్తం!



ఇక్కడ ఉన్న 108 వాహనాలు ప్రొద్దుటూరుకు చెందినది. చిన్న చిన్న మరమ్మత్తుల కారణంగా గత కొద్ది రోజులుగా ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్‌కే పరిమితమైంది. ఇలా మరికొన్ని వాహనాలు నిలిచిపోయాయి. కుయ్..కుయ్ మంటూ రయ్..రయ్ మని 108 అంబులెన్స్ వాహనాలు వస్తాయి. ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం ఆందించి ఆదుకుంటాయి. అది గతం.. ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయి.



- సిబ్బందికి 3 నెలలుగా అందని జీతాలు
- మరమ్మతులకు నోచని వాహనాలు
- భవ్య హెల్త్ కేర్'కు నిర్వహణ పగ్గాలు
- 108 అంబులెన్స్ వ్యవస్థకు గడ్డుకాలం

జిల్లాలో 108 వాహనాలు	: 39
పైలెట్స్	: 98
ఈఎంటీలు	: 95

కడప రూరల్ : కుయ్..కుయ్ మని శబ్దం వినిపిస్తే, ఎవరో ఆపదలో ఉన్నారు. వారిని ఆదుకోవడానికి 108 అంబులెన్స్ వెళుతోందని అందరికీ అర్థం అవుతుంది. అలాంటి వ్యవస్థను పలు సమస్యలు చుట్టుముట్టాయి.

కనిపించని భవితవ్యం..

ఇన్నాళ్లు అరబిందో మెడికల్ సర్వీసెస్ పర్యవేక్షణలో 108 అంబులెన్స్ వ్యవస్థ నడిచింది. ఈ సంస్థకు ఇంకా రెండేళ్ల కాలపరిమితి ఉన్నట్లుగా తెలిసింది. అయితే అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తరుణంలో అరబిందో సంస్థను మే 31వ తేదీన తప్పించారు. జూన్ 1వ తేదీ నుంచి భవ్య హెల్త్ కేర్ సంస్థకు అప్పగించారు. 108 అంబులెన్స్‌తో పాటు కాల్ సెంటర్, మహాప్రస్థానం, హైవే అంబులెన్స్, 104 వైద్య సంచార వాహనాల బాధ్యతలను కూడా అప్పగించారు. కాగా 108 వాహనాల నిర్వహణ బాధ్యతలను భవ్య హెల్త్ కేర్ తీసుకున్నప్పటి నుంచి కనుచూపు మేరలో భవితవ్యం ఏమాత్రం కనిపించడం లేదని ఆ సంస్థ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

సంస్థ మారినా పరిస్థితులు మారేనా..?

జూన్ 1వ తేదీన భవ్య హెల్త్ కేర్ సంస్థ 108 వాహన పర్యవేక్షణ బాధ్యతలను చేపట్టింది. అయితే తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ 108 అంబులెన్స్‌లకు ×చంద్ర₹గ్రహణం పట్టింది. ఆపదలో ఉన్నవారిని ఆదుకొనే బృహత్తరం పథకం గాడితప్పింది. వాహనాల్లో చిన్న..చిన్న సమస్యలు తలెత్తినా మరమ్మతులకు నోచలేదు. భవ్య హెల్త్ కేర్ సంస్థకు పగ్గాలు వచ్చిన జూన్ 1వ తేదీ నుంచే మరమ్మతుల కారణంగా వాహనాలు నిలిచిపోయాయి. ఉదాహరణకు ప్రొద్దుటూరు, మైదుకూరుకు చెందిన వాహనాలు ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్‌లో నిలిచిపోయాయి. పులివెందుల ప్రాంతానికి చెందిన వాహనం పులివెందుల క్రీడా మైదానంలో ఉంది. ఇలా పలు వాహనాలు మరమ్మత్తులకు నోచలేదు. ఎవరికైనా ఆపద వస్తే చుట్టు ప్రక్కల గల ప్రాంతాల నుంచి వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తిరిగితే డీజల్ ఖర్చు ఎందుకని..?

108 వాహనం అవసరమైతే 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలి. వివరాలు చెప్పాలి. కాల్ సెంటర్ నుంచి సమాచారం వాహన సిబ్బందికి వెలుతుంది. దాని ఆధారంగా వారు ఆపదలో ఉన్న బాధితుడి వద్దకు వెళ్లగలరు. అయితే భవ్య హెల్త్ కేర్ వారికి కాల్ సెంటర్ నిర్వహణ బాధ్యతలను కూడా అప్పగించారు. వారు సానుకూలంగా స్పందిస్తారా లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారే అనే సందేహాలు కలుగుతున్నాయి. వాహనాలు తిరగాలంటే డీజల్ పోయాలి. ఇది ఖర్చుతో కూడుకున్న పని. ఏ కారణంగానో వాహనాలు తిరగకుండా ఉంటే డీజల్ ఖర్చు తగ్గించుకోవచ్చనే అభిప్రాయం యాజమాన్యంలో కలగవచ్చనే సందేహలను సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. కాగా సంస్థ మారగానే దాదాపుగా రాష్ట్రంలోని దాదాపుగా అన్ని జిల్లాల్లా ఇన్నాళ్లు పనిచేసిన, కీలకమైన జిల్లా మేనేజర్‌లను తొలగించారు. తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. పాలకుల నిర్లక్ష్యవైఖరి కారణంగా 108 అంబులెన్స్‌లకు గడ్డుకాలం వచ్చిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

సిబ్బందికి ఇబ్బందులు..

108 వాహనాల్లో పనిచేసే పైలెట్ (డ్రైవర్), ఈఎంటీ (మెడికల్ ఎమర్జెన్సీ టెక్నీషియన్) ఇతర సిబ్బంది దాదాపుగా నిరుపేదలే. ఈ సంస్థను నమ్ముకొని, వచ్చే వేతనాలపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే వారందరికీ గడిచిన మూడు నెలల నుంచి వేతనాలు అందలేదు. పైగా జూన్ నెల అంటే పిల్లలను స్కూళ్లలో చేరిృంచాల్సి ఉంటుంది. మిగతా ఖర్చులు బోలెడు ఉంటాయి.దీంతో సిబ్బంది అంతా చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ విషయమై ప్రభుత్వం మాత్రం ఏ చర్యలు తీసుకోలేదని ఉద్యోగులు వాపోతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం...

నేను కొత్తగా వచ్చాను. వివరాలు సేకరిస్తున్నాను. వాహనాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం ,యాజమాన్యం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడతాం.

– సుబ్రమణ్యం, జిల్లా మేనేజర్, 108 అంబులెన్స్

ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరి విడనాడాలి

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుడు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఎస్జీలటీకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే విషయంలో ప్రభుత్వ పెద్దలు మొండి వైఖరి విడనాడాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వెబ్ కౌన్సెలింగ్ వద్దు మాన్యువల్ కౌన్సెలింగ్ ముద్దు అనే నినాదంతో ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు.ఇందులో దాదాపు 500 మంది ఉపాధ్యాయులు పాల్గొనగా 25 మంది నాయకులు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తన తీరు ఇప్పటికైనా మార్చుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులకు గురవుతారన్నారు. పెద్ద ఎత్తున అన్ని జిల్లాల్లో డీఈఓ కార్యాలయాల ముట్టడి జరిగినప్పటికీ ప్రభుత్వంలో కానీ, అధికారుల్లో కానీ ఎలాంటి చలనం రాకపోవడం దారుణం అని విమర్శించారు. కడప జిల్లా ఐక్యవేదిక నాయకుడు మోపూరి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు ఆలోచించి రేపు వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమరనాథరెడ్డి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు గుజ్జల తిరుపాల్, రమేష్‌బాబు, శంకర్‌రెడ్డి, ఇబ్రహీం, సంగమేశ్వర్‌రెడ్డి, కొండారెడ్డి, అబ్దుల్లా, ఖాదర్ బాషా, లెక్కల జమాల్ రెడ్డి, బత్తిని నాగేశ్వరరావు, అమరనాథరెడ్డి తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు మల్లు రఘునాథరెడ్డి

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ఏ పార్టీ శాశ్వతంగా అధికారంలో ఉండదని, పగలు కొన్ని రోజులు, చీకటి కొన్ని రోజులు ఉంటాయని, ఇచ్చిన హామీలు ఏడాది పూర్తయినా కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని, రాష్ట్రంలో మంత్రి లోకేష్ రాజ్యాంగం నడుస్తోందని, కమలాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పులివెందుల సబ్ జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను కలిసి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కూటమి నాయకులు ఎల్లో తోరణాలు కట్టడం దారుణమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు తోరణాలు కట్టారని వైఎస్సార్‌సీపీ నాయకులు డీఎస్పీ, కమిషనర్లనకు వినతి పత్రాలు కూడా అందజేశారన్నారు. అయినా కూడా పట్టించుకున్నా పాపానపోలేదన్నారు. అధికారం శాశ్వతం కాదని ఇది అధికారులు గుర్తుపెట్టుకుని పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బంది పెట్టిన నాయకులు, అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. బ్యానర్లు, తోరణాలు తొలగిస్తే దానికి సంబంధించిన కేసు పెట్టకుండా 307 కేసు పెట్టడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలోరాష్ట్రమంతా అల్లకల్లోలంగా మారిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలకతీతంగా పనిచేసి సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కక్ష సాధింపుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అరెస్టు చేసి ఉంటే ఎవరూ ఉండేవారు కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్ కుమార్, వీరప్రతాప్ రెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి

ప్రణాళిక ప్రకారమే కొమ్మినేని అరెస్ట్

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారమే సాక్షి ఛానెల్ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్ట్ చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. సాక్షి ఛానెల్ డిబేట్‌లో కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు అయన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. వాటిని సాక్షి ఛానెల్‌కు, డిబేట్ నిర్వహిస్తున్న యాంకర్‌కు అంటగట్టడం సరికాదన్నారు. దీనికి సాక్షి యాజమాన్యం, కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా ఒక ప్రణాళిక ప్రకారం కూటమి ప్రభుత్వం సాక్షి కార్యాలయాల వద్ద ఆందోళనలు, దాడులు చేయించి కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు.

సాక్షిపై దాడి అప్రజాస్వామికం



కడప సాక్షి కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో సిబ్బంది నిరసన



కడప డీఎస్పీ కార్యాలయం వద్ద ఫిర్యాదు చేసేందుకు వేచి ఉన్న సాక్షి కడప యూనిట్ ప్రతినిధులు

కడప అర్బన్ : కడప సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా, దాడి చేయడం అప్రజాస్వామికమని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సాక్షి బ్రాంచ్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి బాలకృష్ణారెడ్డి, సాక్షి టీవీ కరస్పాండెంట్ వెన్ను శ్రీనివాసరావు, స్టాఫ్ రిపోర్టర్ నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు కడపలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లును వారు కలిసి వినతి పత్రం అందజేశారు. సాక్షి టీవీలో సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకుడు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలను వెంటనే కొమ్మినేని శ్రీనివాసరావు ఖండించి క్షమాపణలు చెప్పారని గుర్తు చేశారు. అయినా టీడీపీ నాయకులు డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయం వద్ద ఆందోళనలు చేయాలని పిలుపునివ్వడం దారుణమని అన్నారు. కడపలో సాక్షి కార్యాలయంలోకి చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించిన టీడీపీ దుండగులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరారు. టీడీపీ నాయకులు చేసిన హంగామా సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, ప్రత్యక్ష సాక్షులు సైతం ఉన్నారన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తమ కార్యాలయం వద్ద ధర్నా చేయడంతో పాటు సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఈక్రమంలో కడపలోని డీఎస్పీ కార్యాలయంలోకి కేవలం ఇద్దరిని మాత్రమే అనుమతించారు. వినతిపత్రం ఇచ్చే సమయంలో ఫొటోను తీసుకునేందుకు కూడా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిబ్బంది అనుమతించకపోవడం గమనార్హం. సాక్షి కార్యాలయం వద్ద దాడులకు సంబంధించి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల్లోని సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. కార్యక్రమంలో సాక్షి దినపత్రిక సభ్యులు, సాక్షి టీవీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన

సాక్షి కార్యాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ కడపలోని కడప- పులివెందుల రహదారిలో చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సాక్షి యూనిట్ కార్యాలయం సిబ్బంది కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అన్ని విభాగాల సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు మంచిది కాదని, ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

అంతుచిక్కని రహస్యం

- సుమారు నాలుగు నెలలుగా కొనసాగుతున్న సస్పెన్స్
- తాజాగా మున్సిపల్ కౌన్సిల్ హాలు తెరిపించాలని కోరిన మేయర్
- అంగీకరించని కమిషనర్... సర్వత్రా విమర్శలు

కడప కార్పొరేషన్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాలులో ఏముంది...హాలు తాళాలు ఎవరి వద్ద ఉన్నాయి...కౌన్సిల్ హాలును తెరవకుండా ఎందుకంత రహస్యంగా ఉంచుతున్నారనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. మేయర్ సురేష్ బాబు తన విచక్షణాధికారంతో వేదికపై ఉన్న కుర్చీలను తొలగించడంతో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి గత రెండు సమావేశాల్లో రచ్చ రచ్చ చేసి హంగామా సృష్టించారు. తనకు మేయర్‌తో సమానంగా వేదికపై కుర్చీ వేసేవరకూ సమావేశాలు జరుగనివ్వనని హెచ్చరించారు. దీంతో మూజువాణి ఓటుతో మేయర్ అన్ని అంశాలను ఆమోదించారు. ఇప్పటికి సుమారు నాలుగు నెలలుగా నగరపాలక సర్వసభ్య సమావేశం జరగలేదు. కమిషనర్ మనోజ్‌రెడ్డి కౌన్సిల్ హాలులో ఎక్స్ అఫిషియో సభ్యులైన కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు వేదికపై కుర్చీలు ఏర్పాటు చేసి తాళాలు తన వద్ద ఉంచుకున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. గతంలోనే కౌన్సిల్ హాలును తెరిపించాలని కోరితే కమిషనర్ తన వద్ద తాళాలు లేవని చెప్పినట్లు సమాచారం. తాజాగా 3 నెలలు పూర్తయిన నేపథ్యంలో అత్యవసరంగా కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరపాల్సిన ఆవశ్యకత ఉందని, కౌన్సిల్ హాలులో కనీస వసతుల కల్పనకు పరిశీలించాల్సి ఉన్నందున దానిని వెంటనే తెరిపించాలని మేయర్ సురేష్ బాబు స్వయంగా తన లెటర్ హెడ్‌లో కమిషనర్‌ను కోరారు. మేయర్ ఇచ్చిన లేఖను వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి అందజేశారు. అయితే కమిషనర్ సమావేశం జరిగే రోజునే కౌన్సిల్ హాలు తెరుస్తామని, అంతవరకూ తెరిచే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెప్పినట్లు తెలుస్తోంది.

కుర్చీ చుట్టూ తిరుగుతున్న రాజకీయం

కడప నగరపాలక సంస్థలో ప్రజల ఓట్లతో గెలుపొందిన మేయర్, కార్పొరేటర్లకు తగిన గౌరవమిచ్చి వారి సలహాలు, సూచనలకు అనుగుణంగా పాలన చేయాల్సిన కమిషనర్, ఇతర అధికారులు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆర్. మాధవి ఆదేశాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ఆ పార్టీ నేతలను కక్షసాధించడంలో కమిషనర్ భాగస్వాములైనట్లు స్పష్టంగా తెలిసిపోతోంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏర్పాటు చేసుకున్న వాటర్‌ప్లాంట్లను తొలగించడం, ఆక్రమణల పేరిట ఆ పార్టీ నాయకుల షాపులను తొలగించడం, వార్డు సచివాలయాల్లో కార్పొరేటర్లకు ఏర్పాటు చేసిన కుర్చీలు, ఛాంబర్లను తొలగించడం వంటి వరుస ఘటనలు చోటు చేసుకున్నాయి. కమిషనర్ ఆదేశాలతోనే ఇవన్నీ జరిగినట్లు కార్పొరేటర్లు భావిస్తున్నారు. మహానాడు సందర్భంగా కడపలో విచ్చలవిడిగా వారం రోజులపాటు ఫ్లెక్సీలు, హోర్డింగులు, వెలసినా కార్పొరేషన్‌కు మాత్రం రూపాయి ఆదాయం కూడా సమకూరలేదు. సామాన్య టీడీపీ నేతలు వినతులు ఇవ్వడానికి వస్తే లేచినిలబడి వినయ విధేయతలు చూపుతున్న కమిషనర్, కార్పొరేటర్లు వినతులు ఇవ్వడానికి పోతే కనీసం లేచి నిలబడలేదన్న విమర్శలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం మేయర్‌కు తప్ప ఆయనతో సమానంగా ఎక్కడా ఎవరికీ కుర్చీలు ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి రాష్ట్రాల్లోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే కడప నగరపాలక సంస్థలో అందుకు విరుద్ధంగా మేయర్‌కు మాట మాత్రమైనా చెప్పకుండా... తనకే అన్ని విచక్షణాధికారాలు ఉన్నట్లు కమిషనర్ అత్యుత్సాహంతో మేయర్‌తో సమానంగా వేదికపై ఎమ్మెల్యేలకు కుర్చీలు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.కమిషనర్ వైఖరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నా అవేవీ ఆయన పట్టించుకోనట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకే కమిషనర్ ఇలా చేశారని విశ్వసనీయంగా తెలుస్తోంది. అదే గనుక నిజమైతే దానిపై మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏ విధంగా స్పందిస్తారో...ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.



కమిషనర్ మనోజ్‌రెడ్డికి మేయర్ ఇచ్చినలేఖను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

క్లుప్తంగా

భూ తగాదా కేసులో ఏడుగురి అరెస్టు

చాపాడు : గత నెల 27న రాజుపాళెం గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహంలో గల ప్రభుత్వ బంజరు భూమి విషయమై తలెత్తిన ఘర్షణలో సోమవారం ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. పల్లెం శ్రీనివాసులు, నలసింగ్ పెద్ద కుళ్లాయప్ప వర్గీయుల మధ్య గత నెల 27న ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే శ్రీనివాసులు వర్గీయులను అరెస్టు చేయగా, సోమవారం నలసింగ్ పెద్దకుళ్లాయప్పతో పాటు అతని వర్గీయులైన మధు, పవన్, గంగయ్య, కిషోర్, బాబు, కృష్ణయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం


పొలంలోకి దూసుకెళ్లిన బొలెరో వాహనం

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన వెంగళరెడ్డి సోమవారం తన బొలెరో వాహనంలో పులివెందుల నుంచి స్వగ్రామానికి వస్తుండగా, లింగాల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద బొలెరో వాహనం పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. లింగాలకు చెందిన ఆదినారాయణ రెడ్డి రోడ్డుపై స్కూటీని కుడివైపు తిప్పుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీ అకస్మాత్తుగా ఎదురుగా రావడంతో, ఢీకొట్టకుండా తప్పించే ప్రయత్నంలో వెంగళరెడ్డి డ్రైవింగ్ చేస్తున్న సమయంలో బొలెరో అదుపు తప్పి రోడ్డుమీద నుండి పొలంలోకి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణరెడ్డికి స్వల్ప గాయాలు కాగా, ఎవరూ తీవ్రంగా గాయపడలేదు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో ఈనెల 3వ తేదీన గుర్తు తెలియని వ్యక్తిని చికిత్స కోసం చేర్పించారు. అనంతరం 4వ తేదీన పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో ఉంచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు కోరారు.

పోస్టల్ ఇన్సూరెన్స్ భళా!

పాలసీలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రైవేట్ పాలసీలు ఎన్ని వస్తున్నా తపాలా పాలసీలపై ప్రజలకు నమ్మకం ఎక్కువ. తక్కువ చెల్లింపులతో ఎక్కువ బోనస్ ఇస్తారనే విశ్వాసం ఉంది. తపాలా శాఖలో పలు పాలసీలు ఉన్నా ప్రజల్లో అవగాహన ఆశించిన స్థాయిలో లేదు. జీవిత బీమా పథకం ప్రజల జీవితాలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా దోహదపడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలా శాఖలో ఉద్యోగం చేసే వారి కోసం ప్రారంభమైన పీఎల్ఐ(పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్)ను కాలక్రమేణా అందరికీ అందుబాటులోకి తెచ్చారు.

తపాలా బీమా పాలసీలను 18 నుంచి 55 సంవత్సరాల లోపు వయస్సు గలవారు తీసుకోవచ్చు. రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యం ఉంది. పాలసీలు 3 నెలలు, 6 నెలలు, సంవత్సరానికి ఒకసారి చెల్లించే సౌలభ్యముంది. ప్రధానంగా ఆరు రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సంతోష్, సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష బాలాజీ పాలసీలు ఉన్నాయి. వీటిపై ప్రజల్లో చాలా మందికి అవగాహన లేదు. దీనిపై తపాలా శాఖ అధికారులు సభలు, సమావేశం నిర్వహించి మరింత అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

పాలసీ వివరాలు..

- **ఎండోమెంట్ అస్యూరెన్స్(సంతోష్)**

ఈ పాలసీకి 19 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు. కనీస బీమా రూ. 20 వేలు, గరిష్ట బీమా రూ. 50 లక్షలు. పాలసీ తీసుకున్న మూడు సంవత్సరాల తర్వాత రుణ సదుపాయం. మూడు సంవత్సరాలు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం ఉంది. ఐదు సంవత్సరాలు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌లో కోత ఉంటుంది. ఏటా ప్రతి వెయ్యికి రూ. 52 చొప్పున బోనస్ లభిస్తుంది.

- **కన్వర్టబుల్ హోల్ లైఫ్ అస్యూరెన్స్(సువిధ)**

ఈ పాలసీకి 19 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు. కనీస బీమా రూ. 20 వేలు, గరిష్ట బీమా రూ. 50 లక్షలు, పాలసీ తీసుకున్న నాలుగు సంవత్సరాల తర్వాత రుణ సదుపాయం. మూడు సంవత్సరాలు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం. ఐదు సంవత్సరాల లోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు. ఐదు సంవత్సరాలు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌లలో కోత . ఏటా ప్రతి వెయ్యికి రూ. 72 చొప్పున బోనస్ లభిస్తుంది. ఐదు సంవత్సరాలు (ఆరు సంవత్సరాలు దాటరాదు) ఎండోమెంట్ అస్యూరెన్స్ స్కీమ్‌లోకి మారవచ్చు. అప్పుడు బోనస్‌లు అదే పద్ధతిలో లభిస్తాయి. అయితే కన్వర్షన్ లేకపోతే అస్యూరెన్స్‌గా పరిగణిస్తారు.

- **యాంటీసిపేటెడ్ ఎండోమెంట్ అస్యూరెన్స్ (సుమంగళి)**

ఇది మనీ బ్యాక్ పాలసీ. ఈ పాలసీకి 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు. పాలసీ కాలపరిమితి 15–20 సంవత్సరాలు, 15 సంవత్సరాల పాలసీపై 6,9,12 సంవత్సరాలు పూర్తయితే 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం బోనస్. 20 సంవత్సరాల పాలసీపై 8,12,16 సంవత్సరాలు పూర్తయితే 20 శాతం, మెచ్యూరిటీపై 40 శాతం బోనస్. ప్రతి ఏటా వెయ్యికి రూ.48 చొప్పున బోనస్ లభిస్తుంది.

- **జాయింట్ లైఫ్ అస్యూరెన్స్ (యుగళ్ సురక్ష)**

21–45 సంవత్సరాల దంపతులు అర్హులు. కనీస బీమా రూ. 20 వేలు, గరిష్ట బీమా రూ. 50 లక్షలు. పాలసీ కాలపరిమితి 5–20 సంవత్సరాలు. పాలసీ తీసుకున్న మూడు సంవత్సరాల తర్వాత రుణ సదుపాయం. ఐదు సంవత్సరాలు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌లో కోత, మరణానంతర ప్రయోజనాలు భాగస్వామికి లేదా వారి వారసులకు వెళ్తాయి. ప్రతి ఏటా వెయ్యికి రూ. 52 చొప్పున బోనస్ లభిస్తుంది. సింగిల్ ప్రీమియంతో భార్యాభర్తల బీమా కవరేజీని పొడిగించుకోవచ్చు.

- **హోల్‌లైఫ్ అస్యూరెన్స్ (సురక్ష)**

ఈ పాలసీకి 19 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులు. కనీస బీమా రూ. 20 వేలు, గరిష్ట బీమా రూ. 50 లక్షలు. ప్రీమియం చెల్లించే వయస్సును 55, 58, 60 సంవత్సరాలుగా ఎంచుకోవచ్చు. పాలసీ తీసుకున్న నాలుగు సంవత్సరాల తర్వాత రుణ సదుపాయం. మూడు సంవత్సరాలు దాటితే ఎప్పుడైనా పాలసీ సరెండర్‌కు అవకాశం. ఐదేండ్ల లోపు సరెండర్ చేస్తే బోనస్ రాదు. ఐదేండ్లు దాటిన పాలసీల సరెండర్‌పై బోనస్‌లో కోత. ఏటా ప్రతి వెయ్యికి రూ. 76 చొప్పున బోనస్ లభిస్తుంది. పాలసీదారుడికి 59 ఏళ్ల దాకా ఈ స్కీమ్‌ను ఎండోమెంట్ అస్యూరెన్స్ పాలసీల్లోకి మార్చుకోవడానికి వీలుంటుంది. పాలసీదారుకు వయసు 80 దాటితే లేదా పాలసీదారు చనిపోతే వారి వారసులకు బీమా సొమ్ము దానిపై బోనస్ ప్రయోజనాన్ని చెల్లిస్తారు.

- **చిల్డ్రన్ పాలసీ (బాల్ జీవన్ బీమా)**

పాలసీదారుల పిల్లల కోసమే ఈ పథకాన్ని తీసుకొచ్చారు. గరిష్టంగా ఇద్దరు పిల్లలకు బీమా చేసుకునే వెసులుబాటును కల్పించారు. పిల్లల వయస్సు తప్పనిసరిగా 5 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. పిల్లలకు గరిష్టంగా రూ. 3లక్షలు లేదా పాలసీదారు బీమా(సమ్ అస్యూర్డ్) ప్రకారం (ఏదితక్కువైతే అది) ఇన్సూరెన్స్ తీసుకోవచ్చు. పాలసీదారు (పిల్లల తండ్రి) వయస్సు 45 ఏళ్లు దాటరాదు. పాలసీదారు చనిపోతే పిల్లలపై తీసుకున్న బీమాకు ప్రీమియం చెల్లించనక్కర్లేదు. కాలపరిమితి తీరాక బీమా సొమ్ము బోనస్‌లు వస్తాయి. రుణ సదుపాయం, సరెండర్ సౌకర్యం ఉండవు. ప్రీమియం తల్లిదండ్రులే చెల్లించాలి. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలి. అయినప్పటికి వీరికి ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించరు. ఎండోమెంట్ పాలసీ ప్రకారం బోనస్‌లు వర్తిస్తాయి.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తపాలాశాఖ అధికారులు

పాలసీలు ఉపయోగకరం..



తపాలాశాఖ ద్వారా అందే బీమా పాలసీలు ఎంతో ఉపయోగకరం. ఇతర బీమా సంస్థల నుంచి వచ్చే రాబడి కంటే మెరుగైన ఆదాయం వస్తుంది. అన్ని రకాల ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలను అన్ని తపాలా కార్యాలయాల్లో పొందవచ్చు.పాలసీలు తీసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుంది.

– రాజేష్, తపాలాశాఖ సూపరింటెండెంట్, కడప డివిజన్

ప్రతి ఒక్కరి పాలసీ కుటుంబాలకు ఉపయోగకరం



ప్రజలు ప్రతి ఒక్కరు పాలసీలు తీసుకోవడం ద్వారా వారికి వారి కుటుంబ సభ్యులకు ఎంతగానో మేలు చేకూరుతుంది. తపాలా శాఖ అందించే అనేక పీఎల్ఐ స్కీమ్‌లు ఉన్నాయి. వీటిపై అవగాహన పెంచుకొని పాలసీలు తీసుకోవాలి.

–విజయ్ భాస్కర్, అసిస్టెంట్ తపాలాశాఖ సూపరింటెండెంట్, కడప డివిజన్

ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి



పీఎల్ఐ పాలసీని ప్రజలు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పాలసీపై గ్రామాల్లో, నగరంలో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పాలసీ తీసుకుంటే కుటుంబానికి జీవన రక్షగా ఉంటుంది.

– మునాఫ్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్, కడప డివిజన్

కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య తోపులాట

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు వ్యతిరేకంగా నాయకులు నగరంలోని ఐఎంఎ హాలులో సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించంగా షర్మిల వర్గీయులు సమావేశం లోపలికి వచ్చి షర్మిల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. దీంతో రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ మరో వర్గం వారు నినాదాలు చేశారు. దీంతో ఇరువర్గాల నాయకుల మధ్య తోపులాట జరిగింది. దీంతో నాయకుల మధ్య మాటామాటా పెరిగి కుర్చీలతో కొట్టుకునే వరకు వెళ్లింది. షర్మిల వర్గీయులు సుంకర పద్మశ్రీని అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు సుంకర పద్మశ్రీని సురక్షితంగా పంపించారు.


సుంకర పద్మశ్రీతో వాగ్వాదానికి దిగిన షర్మిల వర్గీయులు

స్వలాభం కోసమే కాంగ్రెస్‌లోకి షర్మిల

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తన స్వలాభం కోసమే పార్టీలో చేరారని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ విమర్శించారు. సోమవారం కడపలోని ఐఎంఎ హాలులో పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు వ్యతిరేకంగా పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి షర్మిల ఏనాడు కృషి చేయలేదన్నారు. ఎన్నికల్లో ముడుపులు తీసుకొని స్క్రిప్ట్ చదివారని ఆరోపించారు. కుటుంబ సమస్యలు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం మినహా ఆమె చేసిందేమీ లేదన్నారు.

రఘునాథ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం


రఘునాథరెడ్డి

పులివెందుల టౌన్ : దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికి రెడ్డి రఘునాథరెడ్డికి సోమవారం అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈయన జిల్లాలోని దివ్యాంగుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఎస్కేయూ ప్రొఫెసర్ వెంకటరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పత్రాన్ని సమర్పించడంతో శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. రఘునాథరెడ్డికి డాక్టరేట్ లభించడం పట్ల దివ్యాంగులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

జాయింట్ కలెక్టర్ అదితి సింగ్


గ్రీవెన్ సెల్‌లో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. చింతకొమ్మదిన్నె మండలం జె. కొత్తపల్లి కి చెందిన నూకబోయిన రామమూర్తి తన అధీనంలో ఉన్న భూమికి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ బుక్ ఇవ్వాలని అభ్యర్థించారు. కడపకు చెందిన గయాజ్‌బాషా ఊటుకూరు దగ్గర మా స్థలం రైల్వే గేటు కోసం పోయిందని, దానికి నష్ట పరిహారం అందేలా చూడాలని విన్నవించారు.దువ్వూరు మండలం కానగూడూరు కు చెందిన పి. ఖాసీంబీ తన ఇంటికి కరెంటు, నీటి వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప–కృష్ణాపురం రైల్వే స్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వద్ధుడు(70) రైలు పట్టాలపై పడి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్ఐ తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు 07522 గుంతకల్లు– కడప స్పెషల్ రైలు కింద అకస్మాత్తుగా పడేది లోకో పైలట్ చూశారన్నారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలకు కడప రైల్వే ఎస్ఐ 9440900811లో సంప్రదించాలని కోరారు.

ఒంటిమిట్ట రామాలయం వద్ద అగ్ని ప్రమాదం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయం సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల మేరకు రామాలయం దక్షిణం వైపు గల సీఎం గెస్ట్‌హౌస్ సమీపంలో ఉన్న మొబైల్ మరుగుదొడ్లు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. నిరుపయోగంగా పడి ఉన్న మొబైల్ మరుగుదొడ్లను వెల్డింగ్ సహాయంతో కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దగ్ధమయ్యాయి.

'షైనింగ్ స్టార్స్'తో ఉజ్వల భవిష్యత్తు

జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'షైనింగ్ స్టార్స్–2025' అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో.. 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్–2025 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల నగదు బహుమతి, సత్కారం చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్సీలు ఎం.వి. రామచంద్రారెడ్డి, బి.రాంగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ కో ఆపరేటివ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ జయప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం, దృఢ సంకల్పంతో అడుగులు వేయాలన్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభీష్టాన్ని గుర్తించి వెన్ను తట్టి ప్రోత్సహించాలన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆత్మ విశ్వాసంతో లక్ష్యం వైపు అడుగేస్తే లక్ష్యం చేరుకోవడం కష్టం కాదని తెలిపారు. జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో.. లక్ష్యం వైపు అడుగులేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఆర్జేడీ ఎ. శ్రీనివాసులు, ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య, డీఈఓ షంషుద్దీన్ మాట్లాడారు. అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 266 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మంజూరైన రూ.53,20,000 మెగా చెక్కును జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అతిథులతో కలిసి విద్యాశాఖ అధికారులు, విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రశంసా పత్రాలు, పతకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీలు

కవలల జీవితం.. విషాదాంతం

- చిన్నతనంలోనే తల్లిదండ్రులు దూరమై.. నాన్నమ్మ వద్ద ఉండి చదువుకుంటున్న అన్నదమ్ములు
- వేసవి సెలవులకు మేనమామ వద్దకు వచ్చి నీటి గుంటలో పడి మృత్యువాత

చక్రాయపేట : రామ్ లక్ష్మణ్(10) అనే కవల పిల్లల జీవితానికి దేవుడు చిన్నప్పటి నుంచి అగ్ని పరీక్షలు పెడుతూ వచ్చాడు. ఇంత వరకు నెట్టుకు వచ్చిన అభం శుభం తెలియని ఆ చిన్నారుల పట్ల ఇక ఎందుకు దయ చూపాలి అనుకున్నాడో ఏమో కాని ఆ భగవంతుడు వారిని నీటి గుంత వైపు పంపించి అందులో తోసేసి ప్రాణాలు కోల్పోయేలా చేశాడు. ఈ విషాద సంఘటన చక్రాయపేట మండలం సురభి గ్రామం బీటీపల్లె వద్ద జరిగింది. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం లక్ష్మీపల్లెకు చెందిన సుబ్రమణ్యం, కళావతిలకు రామ్ లక్ష్మణ్‌లు కవలలుగా జన్మించారు. వీరు పుట్టగానే తండ్రి సుబ్రమణ్యం చనిపోయాడు. తల్లి కళావతి పేగు బంధాన్ని తెంచేసుకొని వెళ్లిపోయింది. దీంతో వారిద్దరు అనాథలయ్యారు. దిక్కుతోచని స్థితిలో వారిని కమలాపురంలో ఉంటున్న నాన్నమ్మ బాల ఈశ్వరమ్మ అక్కున చేర్చుకొని కంటికి రెప్పలా చూసుకుంటూ వచ్చింది. అక్కడే వారిద్దరూ చదువుకుంటున్నారు. ఇంతలో వేసవి సెలవులు వచ్చాయి. దీంతో చక్రాయపేట మండలం బీటీ పల్లెలోని మేనమామ కొండయ్య వద్దకు వచ్చారు.


నీటి గుంటలో పడి మృతి చెందిన రామ్‌లక్ష్మణ్

సెలవులు రాకుంటే వారు ఇక్కడికి వచ్చేవారు కారేమో..

ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన కొండయ్య (రామ్‌లక్ష్మణ్‌ల మేనమామ) బతుకు దెరువు నిమిత్తం బీటీపల్లెకు వచ్చి భాస్కర్‌కు చెందిన మామిడి తోటకు కాపలా ఉంటున్నాడు. దీంతో రామ్‌లక్ష్మణ్‌లు సెలవులు కావడంతో బీటీపల్లెకు వచ్చారు. ఆదివారం వారు ఆడుకుంటూ సమీపంలోని బాలయ్య తోటలోకి వెళ్లి అక్కడి నీటి గుంతలో దిగి బయటకు రాలేక చనిపోయారు. ఈ విషాదకర సంఘటనతో ఇటు బీటీపల్లెలోనూ అటు లక్ష్మీపల్లె, నాగసానిపల్లె, కమలాపురంలో విషాదం అలుముకుంది. మృతదేహాలను బంధువులు మైదుకూరు మండలం లక్ష్మీపల్లెకు తీసుకెళ్లిన విషయం తెలిసి పోలీసులు పోస్టుమార్టం కోసం వేంపల్లెకు రప్పించి అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించి శవ పరీక్షలు చేయించారు. మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఉద్యమంలో ఆనాటి త్యాగధనుల జీవితాల నుంచి నేటి తరం స్ఫూర్తి పొందాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వీణా విజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా అధ్యక్షతన 79 సంవత్సరాల ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి, వీణా విజయరామరాజు మరియు మఖ్దుం మొహిద్దీన్‌లకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఏడు దశాబ్దాల ఉపాధ్యాయ ఉద్యమంలో వీణా విజయరామరాజు, మఖ్దుం మొహిద్దీన్, వి.పి. రాఘవాచారి, పెర్నా శ్రీరామమూర్తి లాంటి నాయకులు ఉద్యమాల ద్వారా ఐదు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణను, ట్రిపుల్ బెనిఫిట్ స్కీమ్ ద్వారా పెన్షన్, గ్రాట్యుటీ,క మ్యుటేషన్ , కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డిఏ పొందే సౌకర్యాన్ని అందించారన్నారు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె. సురేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగి రెడ్డిలు మాట్లాడుతూ నేటి నవతరం నాయకులు విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలన్నారు. జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్, జిల్లా నాయకులు షేక్ సాజిత్, షేక్ సాదిక్, నాగేంద్రప్రసాద్, మహబూబ్ బాషా, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులు, బాలరాజు, కరీముల్లా, కస్తూరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.


వీణా విజయరామరాజు, మొహిద్దీన్ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

మూడు బైకులు ఢీ


రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని రాజంపేట గుండ్లూరు క్రాస్ రోడ్డులో మూడు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బోయనపల్లిలో ఇంజినీరింగ్ చదువుతున్న గుంటూరుకు చెందిన మోహనకృష్ణ(20) మృతి చెందాడు.

స్టీల్‌ప్లాంట్ నిర్మాణంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం


కంబాలదిన్నెలో శంకుస్థాపన చేసిన ప్రాంతంలో కాంగ్రెస్ నాయకులు

మైలవరం : కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం విషయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ విమర్శించారు. 2019 జనవరిలో మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామం వద్ద స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతాన్ని సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పద్మశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు వేసిన శిలాఫలకం ఇప్పుడు ఎక్కడా కనిపించడంలేదని ఎద్దేవా చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా మాటలు చెబుతున్నారే తప్ప చేతల్లో మాత్రం ముందుకు రావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, ఇర్ఫాన్ బాషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతకు బహుమతి ప్రదానం


క్రికెట్ టోర్నీ విజేత కెప్టెన్ శ్రావణ్‌కు షీల్డ్‌ను అందిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ అభినవ్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రాము ఆధ్వర్యంలో మే 12వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఫైనల్ మ్యాచ్‌లో పులివెందుల లెజెండ్స్ జట్టు విజేతగా నిలవగా, వంశీ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.60 వేల నగదు బహుమతితోపాటు షీల్డ్‌లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు వైఎస్ అభినవ్ రెడ్డిలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శశికాంత్‌రెడ్డి, నిర్వాహకులు శ్రావణ్‌రెడ్డి, చిన్న, శేషు, రాజేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు


కడప రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను పరిశీలిస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : గంజాయి, డ్రగ్స్ నిర్మూలన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జీఆర్పీ సీఐ సుధాకర్‌రెడ్డి, ఆర్పీఎఫ్ సీఐ కోటేశ్వరరావులు పేర్కొన్నారు. సోమవారం రైల్వే డీఐజీ, గుంతకల్లు రైల్వే ఎస్పీల సూచనల మేరకు కడప రైల్వేస్టేషన్‌లో విశాఖపట్టణం నుంచి వచ్చే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసులు ప్రయాణికుల బ్యాగ్‌లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, నిషేధిత వస్తువుల నిర్మూలన కోసం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించచడం జరిగిందన్నారు.